క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో మొగల్రాజపురం సెక్షన్, లబ్బీపేట ఉపకేంద్రం పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా పశువుల ఆస్పత్రి నుంచి డి అడ్రస్ మాల్ వరకూ ఎంజీరోడ్డుకు ఇరువైపుల, పీవీపీ మాల్ నుంచి డీవీ మానర్ హోటల్ వరకూ, వైవీరావు హాస్పటల్‌రోడ్డుకు ఇరువైపులా, జమ్మిచెట్టు సెంటర్, లబ్బీపేట, కళానికేతన్ వెనుక ప్రాంతం, రఘురామవీధుల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఓటు వేస్తే ఉచితంగా కంటి వైద్య పరీక్షలు



పటమట(విజయవాడతూర్పు): ఎన్నికల సంఘం పిలుపు మేరకు ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు తమ ఆస్పత్రి కృషి చేస్తుందని శంకర నేత్ర చికిత్సాలయ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాదేళ్ల స్వాతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు జరిగే మే 13వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు ఓటు హక్కు వినియోగించుకున్న వారికి ఉచిత కంటి వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు వేలిపై సిరా ముద్ర చూపితే చాలని తెలిపారు. రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తక్కువ ఖర్చుతో కంటి శుక్లాల శస్త్ర చికిత్సలు ఫ్యాకో పద్ధతి ద్వారా చేస్తామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, వర్కింగ్ జర్నలిస్టులకు ఉన్న హెల్త్ స్కీములు తమ వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విజయవాడ పరిసరప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆమె ఉచిత కంటి వైద్యానికి సంబంధించి రూపొందించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డాక్టర్లు రోహిత్; జరీనా, అన్నపూర్ణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దక్షిణామూర్తికి విశేష పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో కెఎస్.రామరావు పాల్గొన్నారు.

తూర్పులో అవినాష్ గెలుపు ఖాయం

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణ
- మోడీ రోడ్‌షో అట్టర్ ఫ్లాప్
- ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్
- అవినాష్ రోడ్ షోకు ప్రజలు బ్రహ్మరథం



వర్షంలోనూ ప్రచారం చేస్తూ ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ తదితరులు



నృత్యాలు చేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న యువతులు



రోడ్డు షోలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, వేదికపై రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ

కృష్ణలంక/ఆటోనగర్(విజయవాడతూర్పు):ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్ గురువారం నిర్వహించిన రోడ్ షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా హారతులిస్తూ ప్రజలు స్వాగతం పలికారు. నాలుగు గంటల పాటు సాగిన రోడ్‌షోలో ఎక్కడ చూసిన జనం వేలాదిగా తరలివచ్చి మీకు మేము అండగా ఉన్నామంటూ భరోసా ఇచ్చారు. రామలింగేశ్వరనగర్‌లో ప్రారంభమైన రోడ్‌షో కృష్ణలంక భ్రమరాంబపురం వరకూ కొనసాగింది. ప్రచార వాహనంలో దేవినేని అవినాష్, పార్లమెంటు అభ్యర్థి కేశినేని శ్రీనివాస్‌లతోపాటు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. ఈ రోడ్‌షో ఎన్నికల్లో గెలిచిన తర్వాత నిర్వహించే విజయోత్సవ యాత్రలా సాగింది. రోడ్‌షోకు కృష్ణానది కరకట్ట ప్రాంతాల ప్రజలతో పాటు, అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది.

అవినాష్ గెలుపు తథ్యం: మోపిదేవి

రోడ్‌షోలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ ర్యాలీ జరిగిన తీరు చూస్తే అవినాష్ గెలుపు తథ్యం అనే విధంగా ఉందన్నారు. ప్రతి ప్రాంతంలో ప్రజలు అవినాష్‌కి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీగా సీట్లు గెలవబోతున్నామన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులందరూ ఐదేళ్లుగా అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి సాక్షిగా గెలవబోతున్నారన్నారు. బుధవారం నిర్వహించిన ప్రధాని నరేంద్రమోదీ రోడ్‌షో అట్టర్‌ఫ్లాప్ అయిందని వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంటు అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ అన్నారు. మూడు జిల్లాల నుంచి జనాలను తరలించినా రోడ్‌షోలో కనిపించలేదన్నారు. ఎంతమంది కలిసి వచ్చిన వైఎస్ జగన్‌ను ఓడించటం కల అన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో జగన్ అత్యధిక సీట్లతో గెలవబోతున్నారన్నారు. మీ బిడ్డగా నాకు ఒక్క అవకాశం ఇవ్వండి, మీ కుటుంబంలో ఒకడిగా ఉంటూ సేవ చేసుకుంటానని దేవినేని అవినాష్ అన్నారు. జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కార్యకర్తలు, అభిమానులు తన రోడ్‌షోలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఎండైనా, వర్షమైనా తమ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తున్నారని చెప్పారు. కార్పొరేషన్ ఎన్నికల్లో మోపిదేవి వెంకట రమణ కృష్ణలంక ప్రాంతంలో ప్రచారం చేశారని, కార్పొరేటర్లు భారీ మెజారిటీతో గెలిచారన్నారు. ఇప్పుడు కూడా అదే రిపీట్ అవబోతుందని తెలిపారు.

పోలింగ్ నిర్వహణకు పటిష్ట కార్యాచరణ

– కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పటిష్ట కార్యాచరణతో ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి ఎన్నికలకు సంబంధించి చివరి 72 గంటల్లో చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు ప్రణాళిక అమలు తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, ఐజీలు, డీఐజీలు, సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీసీకి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, అధికారులతో కలిసి హాజరయ్యారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి పలు అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ 13న జరిగే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సిబ్బందికి నాణ్యమైన శిక్షణనిచ్చామని అన్నారు. భద్రత విషయంలోనూ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రతి పోలింగ్ లొకేషన్ వద్ద ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 1,874 పోలింగ్ స్టేషన్లలో 900 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని.. 1,267 కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 544 మంది మైక్రో అబ్జర్వర్లు సేవలందిస్తారని చెప్పారు.

రిటైనింగ్ వాల్ నిర్మించిన ఘనత వైఎస్ జగన్‌దే

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్



అవినాష్‌కు హారతులిస్తున్న మహిళలు



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని టర్లను అభ్యర్థిస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు):వరద ముంపు నుంచి కరకట్ట ప్రాంత వాసులకు రక్షణగా రిటైనింగ్ వాల్ నిర్మించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంక ప్రాంతంలోని 16, 17, 18 డివిజన్లలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రిటైనింగ్ నిర్మించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ పాదయాత్ర ర్యాలీ నిర్వహించారు. 16వ డివిజన్‌లోని గీతానగర్ కట్ట నుంచి ప్రారంభమైన ర్యాలీ భూపేష్‌నగర్, తారకరామనగర్ కరకట్ట మీదుగా వారధి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మహిళలు అడుగడుగునా స్వాగతం పలుకుతూ హారతులతో బ్రహ్మరథం పట్టారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ తమ కష్టాలు తెలుసుకుని కేవలం ఒక సంవత్సరం కాలంలోనే రిటైనింగ్ వాల్ నిర్మించి వరద ముంపు నుంచి కాపాడిన దేవుడు జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి మళ్లీ ఆయననే సీఎం చేసుకుంటామని కరకట్ట ప్రాంత వాసులు సంతోషంగా చెబుతున్నారన్నారు. జగనన్న నాయకత్వంలో తమ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తానే చేశానని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్ రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధి రూపంలో పొందిన లబ్ధిని అందరూ గమనించారని పేర్కొన్నారు. ఎంతమంది ఏకమైనా, ఎన్ని మీడియా చానళ్లు, సోషల్ మీడియాల్లో ప్రచారం చేసిన ప్రజానీకం జగన్ వెంటనే ఉన్నారని తెలిపారు. అయనకే ఓట్లు వేస్తామని చెబుతున్నారన్నారు. పదేళ్లు ఒక వ్యక్తికి అవకాశం ఇస్తే నమ్మించి మోసం చేశారని వైఎస్సార్ సీపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ ఫ్లోర్ లీడర్, 18వ డివిజన్ కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ, 16,17 డివిజన్ల కార్పొరేటర్లు ఉమ్మడిశెట్టి రాధిక, తంగిరాల రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకే ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

గుణదల(విజయవాడతూర్పు): ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బహ్మయ్య మాదిగ తెలిపారు. గుణదలలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా నడిపించేందుకు జగనన్న కృషి చేశారని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రమే బడుగు, బలహీన వర్గాలు, దళితులు అభ్యున్నతి సాధించారని పేర్కొన్నారు. టీడీపీ, బీజేపీలు దళితులకు వ్యతిరేకమని చెప్పారు. బీజేపీ అధికారంలో ఉంటే మాదిగల ఉనికి కనుమరుగవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో ఇటీవల జరిగిన క్రైస్తవుల పై దాడి ఘటన దీనికి నిదర్శనమన్నారు. దళితుల పట్ల కూటమి నేతలు ఓట్ల కోసం కపట ప్రేమ నటిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, కూటమి నేతలకు ఓటమి తప్పదని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్మూరి గరగయ్య, కొమరోల శ్రీనివాస్, మానికొండ క్రాంతి,ఉమ్మడి ధనరాజ్ పాల్గొన్నారు.

అలరించిన హరికథ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో తాడేపల్లిగూడెంకు చెందిన భాగవతారిణి శారదా హరికథ భక్తులను అలరించింది. అమ్మవారి సన్నిధిలోని ధర్మపథం వేదికపై గురువారం సాయంత్రం పంచహారతుల సేవ అనంతరం శారదా బృందం హరికథను ఆలపించారు. భక్తులు హరికథను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు.